
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 22 జనవరి 2025


సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, డైరెక్టర్లు

యూరియా కోసం ఆందోళన

- బోనకల్ మండలం ఆళ్లపాడులో రైతుల ధర్నా
- ముగ్గురు సొసైటీ డైరెక్టర్ల రాజీనామా ప్రకటన
- డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి

వివరాలు : 6లో


సీతారాముల కల్యాణ దృశ్యం(ఫైల్)

భద్రాద్రిలో మార్చి 30నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

- ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కల్యాణం
- 7న శ్రీరామ మహాపట్టాభిషేకం

6

తొలిరోజే రసాభాస


కూసుమంచి మండలం గట్టుసింగారంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

గందరగోళంగా 'సంక్షేమ' గ్రామసభలు

- జాబితాల్లో పేర్లు లేకపోవడంతో పలువురు ఆందోళన
- అనర్హులను జాబితాల్లో చేర్చారని ఆగ్రహం
- పలుచోట్ల అధికారుల నిలదీత
- సర్దిచెప్పేందుకు అధికారులు సతమతం
- 'ప్రజాపాలన' దరఖాస్తుల గల్లంతే కారణమా ?
- ఇరు జిల్లాల్లో తొలిరోజు భారీ సంఖ్యలో కొత్త దరఖాస్తులు

ఖమ్మం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని ఆశతో ఎదురు చూసిన దరఖాస్తుదారులకు నిరాశే మిగిలింది. 26వ తేదీనుంచి అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాల ప్రకటనకు ఉద్దేశించిన గ్రామసభలు తొలిరోజే రసాభాసగ మారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు అసంతృప్తుల ఆగ్రహం, అధికారుల నిలదీతలతో గందరగోళంగా సాగాయి. ఆయా నిరసనలకు గతంలో అధికారుల చేసిన తప్పిదాలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే నేడు గ్రామసభల్లో నిరసన జ్వాలలు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

గ్రామ, వార్డు సభల్లో ఆందోళనలు

ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించి నిర్వహించిన గ్రామసభలు రసాభాసాగా మరాయి. ఆయా సభల్లో పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలు ప్రకటించడంతో అనేకమంది అర్హత ఉన్నా తమను జాబితాలో చేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక చోట్ల అనర్హులకు అవకాశం కల్పించారని ఆందోళనలు చేశారు. అర్హుల జాబితాలో ఉండాల్సిన తమ పేర్లు లేవంటూ పలువురు అధికారులను ప్రశ్నించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల విషయంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైది. ఖమ్మం నగరంలోని 3వ డివిజన్ బల్లేపల్లిసభలో ప్రత్యేక అధికారి శివలింగంతో కొంత మంది దూషణగా మాట్లాడారు. కూసుమంచి మండలం గట్టుసింగారంలో పలువురు అధికారులను నిలదీశారు. ఆగ్రహంతో గోడకు అంటించిన అర్హుల జాబితాను చించివేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. సెంటుభూమి, నివాసాలు లేని తమకు అన్యాయం జరిగిందని సుమారు రెండు గంటల పాటు సభను అడ్డుకున్నారు. పోలీసులు కలగజేసుకొని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. సత్తుపల్లి మండలం తుంబూరు, సిద్దారం, కిష్టారం, వేంసూరు మండలం కుంచపర్తి, భీమవరం గ్రామాల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. చింతకాని మండల పరిధిలోని వందనం, నేరడ, చింతకాని, నాగులవంచ, బొప్పారం, అనంతసాగర్, చిన్నమండవ, బస్వాపురం గ్రామాల్లో గ్రామసభల్లో రసాభసగా సాగాయి. వైరా మండలం, మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో మంగళవారం జరిగిన గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలకు ఎంపిక కాని పలువురు అర్హులు అధికారులను నిలదీశారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామంలో అమెరికాలో నివాసం ఉంటున్న వ్యక్తులకు రేషన్‌కార్డులు మంజూరు చేసి గ్రామంలో అర్హులైన వారికి రేషన్‌కార్డులు రాలేదని ఓ వ్యక్తి ఆగ్రహించడంతో తహసీల్దార్ ఉషాశారద జోక్యంతో గొడవ సర్దుమణిగింది.


గట్టుసింగారంలో గోడకు అంటించిన జాబితాను చించివేసిన గ్రామస్థులు

పమ్మి గ్రామంలో అర్హులైన తమకు అన్యాయం చేశారని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో గ్రామ సభలు రసాభాసాగానే సాగాయి. దాంతో అధికారులు అర్హుల జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సర్దిచెప్పడంతో ఆందోళనలు సద్దుమణిగాయి.

లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని ఆరో డివిజన్, ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో నిర్వహించిన సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు పథకాల అర్హుల జాబితాను పరిశీలించి మార్పులు ఏమైనా ఉంటే చర్చ పెట్టుకోవాలన్నారు. ప్రాథమిక జాబితాలో అర్హులెవరికైనా అవకాశం రాకపోతే మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. గ్రామ సభల్లో పెట్టేవి ప్రాథమిక జాబితాలు మాత్రమేనన్నారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ వివరించారు. గ్రామసభల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సీపీ సునీల్‌దత్ బందోబస్తును పర్యవేక్షించారు.

తొలిరోజు భారీగా దరఖాస్తుల వెల్లువ

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 589 పంచాయతీలు, 125 మునిసిపల్ వార్డుల్లో సభలు నిర్వహించాలని నిర్ణయించగా.. మంగళవారం 208 పంచాయతీలు, 42 వార్డులలో సభలు నిర్వహించి అర్హుల జాబితా ప్రకటించారు. అయితే చాలా చోట్ల ప్రజాపాలన దరఖాస్తులు గల్లంతు కావడం వంటి కారణాలతో అనేక మంది మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 41,282 దరఖాస్తులు స్వీకరించగా.. వాటిల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,783, రేషన్‌కార్డుల కోసం 15,721, రైతుభరోసా కోసం 1565, ఇందిరమ్మ ఆత్మీయభరోసా కోసం 9213 దరఖాస్తులు ఉన్నాయి.

కుళ్లిన కూరగాయలతో వంట


పుచ్చులతో వాడిపోయిన వంకాయలు

- మార్కెట్‌లో బయటపడేసిన కూరగాయలతో వంటచేస్తున్న వైనం
- అధికారుల సమక్షంలోనే పుచ్చిపోయిన కూరగాయలతో వంట
- అధ్వానంగా మధ్యాహ్న భోజనం
- ఖమ్మం నాలుగో డివిజన్‌లోని ఓ పాఠశాలలో నిర్వాహకుల నిర్వాకం

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, అందుకు వారంలో ఒక రోజు జిల్లాస్థాయి అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో పద్ధతి మారలేదనే వినిపిస్తున్నాయి. అధికారులు వచ్చిన రోజున ఒకలా మిగిలిన రోజుల్లో మరోలా భోజనం వండుతున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు. అధికారులు ఏ రోజున, ఏ పాఠశాలకు వస్తున్నారో ముందే చెప్పటంతో ఆ రోజు మధ్యాహ్న భోజనం రుచిగా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు మధ్యాహ్న భోజనం వండే కార్మికులు ఖమ్మం కూరగాల మార్కెట్ వద్ద బయట పడపోసిన వంకాయలు, టమాటాలు, క్యాబేజీ, పచ్చిమిరపకాయలు, తదితర కూరగాయలను తెల్లవారుజామును వెళ్లి తీసుకొచ్చి మధ్యాహ్న భోజనంలో వాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఎక్కువగా టమాటాలు, వంకాయలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా వారిలో మార్పు రావడం లేదు.

ఖమ్మం నగరంలోని నాలుగో డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం డివిజన్ సభ నిర్వహించారు. వాస్తవానికి పాఠశాల జరుగుతున్న సమయంలో ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిసినా కొందరు అధికారులు సభ నిర్వహించారు. ఇదే సమయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న కొందరు కార్మికులు సభ జరుగుతున్నా, అధికారులు పక్కనే ఉన్నా పుచ్చిపోయిన వంకాయలు తీసుకొచ్చి వంట చేసేందుకు సిద్ధపడ్డారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కానీ, అధికారులు కానీ దీని గురించి పట్టించుకోలేదు. దాంతో ఆ కూరగాయలతోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ పాఠశాలలో ఎక్కువగా కుళ్లిన కూరగాయలతోనే (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 6వేల మంది విద్యార్థులు
- పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేత
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు బుధవారం ప్రారంభంకానున్నాయి. ఖమ్మం జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం విద్యార్థులు ఆరు వేల మంది పరీక్షలకు హాల్‌టికెట్లు పొందారు. పరీక్షా కేంద్రాలుగా బొమ్మా ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కాలేజీ, ఎస్‌బీఐటీ పాకబండబజార్, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనవరి 22, 23, 24, 28, 29 తేదీల్లో జేఈఈ మెయిన్స్ 30న బీఆర్క్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు మొదటి షిఫ్ట్ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3గంటల నుంచి 6గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలి. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయనున్నారు. ఎన్‌టీఏ నిర్వహించే ఈ పరీక్షలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి పరీక్షను నిర్వహిస్తున్నారు.



ఆధార్‌కార్డు, బొటనవ్రేలి ముద్ర అనుసంధానమై ఉంటాయని, రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మాత్రమే విద్యార్థి పరీక్ష రాసే స్థానం నిర్దేశిస్తారు. కాబట్టి అభ్యర్థి కాకుండా వేరే వారు పరీక్ష రాసే అవకాశం ఎంతమాత్రం ఉండదు. పరీక్షకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా 2 పాస్ ఫొటోలు, ట్రాన్స్‌పరెంట్ పెన్, అడ్మిట్‌కార్డ్, ఆధార్‌కార్డ్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకు రావాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష అనంతరం ప్రతీ విద్యార్థి పరీక్ష కేంద్రంలో ఇచ్చిన రఫ్ బుక్‌లెట్‌ను డ్రాఫ్ట్‌బాక్సులో వేయాలి.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.20కోట్లు




రీజినల్ మేనేజర్ సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంక్రాతి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోల పరిధి నుంచి 1,277 అదనపు బస్సులతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చటంతో ఆర్టీసీ ఆదాయం రూ.20కోట్లు, 73లక్షల, 48వేల ఆదాయం లభించిందని రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. జనవరి 9నుంచి 14వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిర, సత్తుపల్లి, మణుగురు, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగుడెం ఖమ్మంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను, జనవరి 15నుంచి 20వ తేదీ వరకు తిరుగుప్రయణం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరిందని ఆర్‌ఎం తెలిపారు. రీజియన్ పరిధిలో మొత్తం 25లక్షల, 80వేల మంది ప్రయాణికుల్లో 15లక్షల, 97వేల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణాలు కొనసాగించారన్నారు. మొత్తం 30లక్షల, 96వేల కిలోమీటర్లు బస్సులు తిరిగాయని తెలిపారు. జనవరి 11న 2లక్షల, 38వేల మంది, జనవరి 19న 2లక్షల, 34వేల మంది ప్రయాణించారని తెలిపారు. సత్తుపల్లి డిపో అంధ్రా సరిహద్దున ఉండడంతో ఆయా ప్రాంతాల్లో 1,030 సర్వీసులకు అదనంగా మరో 277 సర్వీసులను ఏర్పాటు చేసి మొత్తం 1,277 సర్వీసులను నడపినట్లు తెలిపారు.

డిపోల వారీగా ఆదాయ వివరాలు

ఖమ్మం డిపో నుంచి రూ.4కోట్ల 86లక్షల, 69వేలు, మధిర డిపో నుంచి (మిగతా 6వ పేజీలో)

ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు అప్రజాస్వామికం

- ఆదివాసీలు, ఉద్యమకారుల నిర్మూలన మానుకోవాలి
- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 21: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వరస ఎన్‌కౌంటర్లతో కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, ఆదివాసులు, ఉద్యమకారుల నిర్మూలన లక్ష్యంగానే కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు పనిచేస్తున్నాయని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పోటు రంగారావు ఆరోపించారు. వందల మందిని వేటాడి పట్టుకొని చంపటమే ప్రభుత్వ పనిగా మారిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీలు, ఉద్యమకారులు (మిగతా 6వ పేజీలో)

గ్రంథాలయాలు ఉపాధి సృష్టి కేంద్రాలు

- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
- ఇల్లెందు పర్యటనలో ఐటీడీఏ పీవో రాహుల్

ఇల్లెందు, జనవరి 21(ఆంధ్రజ్యోతి:): గ్రంథాలయాలు ఉపాధి సృష్టి కేంద్రాలని, నిరుద్యోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు. ఇల్లెందులో బుధవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న గ్రంథాలయాన్ని పీవో మంగళవారం సందర్శించారు. గ్రంథాలయంలోని గదులను పాఠకుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పరిజ్ఞానం పెంచుకునేందుకు న్యూస్ పేపర్లు, సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతి, యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయం కోసం సరఫరా చేసిన పుస్తకాలు సక్రమంగా పాఠకులకు అందుబాటులో ఉండేలా అమర్చాలన్నారు. గ్రంథాలయాన్ని ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయం తెరిచి ఉంచాలన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు, మెటీరియల్ పూర్తిస్థాయిలో


ఆశ్రమ కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

» సైబర్‌క్రైం ఏసీపీ

ఖమ్మంక్రైం, జనవరి20(ఆంధ్రజ్యోతి): విలాస వస్తువులు ఇస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని మాయమాటలతో మోసం చేసే అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఖమ్మం సైబర్‌క్రైం పోలీసు స్టేషన్ ఏసీపీ సీహెచ్ ఫణీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాశే సైబర్ నేరగాళ్లకు ఆయుధాలని, మొబైల్‌ఫోన్లలో ఫేస్‌బుక్, వాట్సాప్ , టెలిగ్రాం, యూట్యూబ్, ఈమెయిల్, ఫోన్‌కాల్‌ల ద్వారా దృష్టిని ఆకర్షించే కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగవద్దని అన్నారు. ఒకవేళ జాగ్రత్తలు తీసుకున్నా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నెంబరుకగాని సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో కాని సమీప పోలీసుస్టేషన్‌లో అయినా పూర్తివివరాలతో ఫిర్యాదుచేయాలని తెలిపారు.

క్షయ రహిత ప్రాంతంగా భద్రాద్రి..

» భద్రాద్రి కలెక్టర్‌కు అభినందన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి21(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత ప్రాంతంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడుగులు వేస్తోందని, కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను జాతీయ క్షయ ప్రత్యేక బృందం అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. క్షయ వ్యాధి నివారణ పని తీరుపై పర్యవేక్షించి సమీక్షించారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్ అని పేర్కొన్నారు.



మిర్చికి ధర పెట్టలేరు..

మార్కెట్‌లో కొర్రీలు పెడుతున్న మాఫియా

» రోజు రోజుకూ పెచ్చు మీరుతున్న బాగోతం
» కాంటాల సమయంలో పేచీలు
» ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు
» భారీగా నష్టపోతున్న రైతులు
» వందలాది మంది పేచీలతో సతమతం
» నూతన మార్కెట్ పాలకవర్గం కట్టడి చేయాలని డిమాండ్

ఖమ్మం మార్కెట్ , జనవరి 21(ఆంధ్రజ్యోతి): అమ్మబోతే అడవి.. కొనబోతె కొరివి అన్న చందంగా ఉంది మిర్చి రైతులు పరిస్థితి. ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాక సతమతమవుతుంటే కొనుగోలు చేసిన పంటను కాంటాలు వేసేప్పుడు ధర తగ్గించాలని కొర్రీలు పెడుతున్న వ్యాపారులు వారిని తీవ్రంగా నష్ట పరుస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో కొనుగోలు అయిన పంట కాంటాలు అవుతాయా లేదా అని సతమతమవుతున్నట్లు వాపోతున్నారు. కొన్న పంట మొదట కొనుగోలు చేసిన ధర చెల్లిస్తారా లేదా అనేది అసలు నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఇటీవలి కాలంలో కొర్రీల మాఫియా ఆగడాలు ఎక్కువ అయ్యాయని, వారితో తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని వారిని కట్టడి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాంటాల సమయంలో ధర తగ్గిస్తున్న వ్యాపారులు

మార్కెట్లో నిత్యం ఉదయం ఏడు గంటలకు జెండా పాట ముగిసిన తరువాత వ్యాపారులు యార్డులలో తిరుగుతూ పంటను కొనుగోలు చేయడం ఆనవాయితీ అని చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. ఆ సమయంలో కొనుగోలు చేసిన ధర కాంటాలు పూర్తయ్యాక కాంటా విలువ ఆధారంగా రైతులకు పంట తాలుకా నగదు మొత్తం చెల్లించాలి. కాగా ఇటీవలి కాలంలో కొంతమంది వ్యాపారులు మొదట పంట కొనేది ఒక రేటు కాంటాల సమయంలో పేచీ పెట్టి క్వింటాలుకు రూ.800ల నుంచి రూ. వెయ్యి వరకు తగ్గిస్తేనే కొనుగోలు చేస్తామంటూ కొర్రీలు పెడుతుండటం మరో రూటుగా ఎంచుకోవడం విశేషం. మార్కెట్లో నిత్యం అలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

కొర్రీలను కట్టడి చేయాలని డిమాండ్

మార్కెట్లో నిత్యం రైతులను నష్ట పరిచే కొర్రీలను మార్కెట్‌కు కొత్తగా ఎన్నికైన పాలకవర్గం కట్టడి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్లో మాఫియాగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. పంట కొనుగోలు చేసేది ట్రేడర్ అయితే కాంటాల ప్రక్రియలో పేచీలు పెట్టేది మాత్రం వ్యాపారుల గుమస్తాలు అని రైతులు పేర్కొంటున్నారు. కాంటాల సయమంలో పేచీలు పెట్టే సంగతి అసలు ట్రేడర్లకు తెలుసా? తెలవదా? లేక గుమస్తాలు చేతివాటం ఏమైనా ప్రదర్శిస్తున్నారా అనే అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు.

క్వింటాలుకు రూ. 800 తగ్గిస్తేనే కొంటారట

ధరావత్ హరిచంద్ర నాయక్, మిర్చి రైతు



మార్కెట్‌కు 25బస్తాల మిర్చి పంటను అమ్మకానికి తీసుకొచ్చా. వ్యాపారులు క్వింటాలు రూ. 14,500 లకు కొనుగోలు చేశారు. గంట సమయం తరువాత కాంటాల సమయంలో మిర్చిలో తేమ ఉందని, ఉబ్బులు ఉన్నాయని క్వింటాలుకు రూ. 800లు తగ్గించి రూ.13,700 లకు ఇస్తే కొనుగోలు చేస్తామని లేదంటే ఈ పంట అవసరం లేదన్నారు.

విలాసోత్సవాలు ప్రారంభం

» తొలిరోజున నృసింహ దాస మండపంలో నిర్వహణ

భద్రాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాం గణంలోని శ్రీ నృసింహ దాస మండపంలో మంగళవారం విలాసోత్సవాల్లో భాగంగా తొలి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం పంచాయతీ ప్రత్యేక అధికారి బి. రాహుల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి స్వామి వారిని మంత్రోచ్చారణల నడుమ తీసుకొచ్చి మండపంలో ఆసీనులను చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, భద్రాచలం గ్రామపంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు దంపతులు స్వామి వారిని దర్శించుకన్నారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ విలాసోత్సవాలు మూడు రోజుల పాటు సాగనుండగా బుధవారం దసరా మండపంలో డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

భూముల ఆక్రమణ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా

» ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు

భద్రాచలం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అల్లూరి జిల్లా పురుషోత్తపట్నంలో భద్రా ద్రి రామయ్యకు చెందిన భూములలో ఆ క్రమణల విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. ఆక్రమణలు జరిగిన సమయంలో భద్రాద్రి దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేస్తే పోలీసు అధికారులు స్పందించేలా కృషి చేస్తానన్నారు. మంగళవారం ఆయన భద్రాచలంలో రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తరుచూ పురుషోత్తపట్నంలోని రామయ్య భూములు ఆక్రమణలు చోటుచేసుకుంటున్న క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన చైర్మన్ శంకరరావు ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని దేవస్థానం అధికారులకు హామీ ఇచ్చారు.

యూరియా అందించడం లేదని ఆళ్లపాడు రైతుల ధర్నా

» ముగ్గురు డైరెక్టర్ల రాజీనామా ప్రకటన

బోనకల్, 21(ఆంధ్రజ్యోతి): యూరియా అందించడంలో రావినూతల సొసైటీ చైర్మన్, సీఈవోలు విఫలమయ్యారని మంగళవారం సొసైటీ ఎదుట ఆళ్లపాడు రైతులు, ముగ్గురు డైరెక్టర్లు ఆందోళనకు దిగారు. రైతులకు మద్దతుగా సొసైటీ డైరెక్టర్లు తోటకూర వెంకటేశ్వరరావు, చినకేశి పెద్ద వెంకయ్య, మరీదు వెంకట్రావు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్క సాగుకు సంబంధించి తడులు పెట్టిన వెంటనే యూరియా అవసరం కావడంతో సొసైటీకి వెళ్లగా అక్కడ కొద్ది మంది రైతులకు మాత్రమే ఇచ్చారని వాపోయారు. రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్న విషయంపై సొసైటీ చైర్మన్‌ను సంప్రదించే ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేదని ఆరోపించారు.

సొసైటీ సమావేశాలను సక్రమంగా నిర్వహించడం లేదని, యూరియా సమస్య పై స్పందించక పోవడంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పారా వెంకట మోహన్‌రావు, మందా రామారావు, బుంగా నరేష్, ఎస్‌కే పెంటు సాహెబ్, మల్లాది లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలో వెన్నెలకు ప్రథమ స్థానం



సన్మానిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ రమేష్

ఖమ్మం రూరల్/ తల్లాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షలో ఖమ్మం రూరల్ మండలం, జలగంనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వెన్నెల రాష్ట్ర స్థాయిలో అన్ని విభాగాలలో అత్యధిక మార్కులు (91) సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జిల్లా ఖ్యాతిని మరోమారు నిలింపింది. గత మూడు సవంత్సరాలుగా రాష్ట్ర స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్షల్లో జిల్లా విద్యార్థులే ప్రథమ స్థానంలో నిలుస్తునారని హెచ్ఎం శాంసన్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన పి.వెన్నెలను రాష్ట్ర డైరెక్టర్ రమేష్ ఘణంగా సన్మానించి మెమెంటో, ప్రశంసాపత్రం తోపాటు రూ.5వేలు నగదు పారితోషికం అందజేశారు. తల్లాడ మండలం పినపాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ ఆసీఫ్ నాల్గోస్థానంలో నిలిచాడు.

'కొచ్చర్ల'కు జాతీయ పురస్కారం



సురేష్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అధ్యాత్మిక సేవలు అందజేస్తున్న కొత్తగూడేనికి చెందిన అధ్యాత్మిక గురువు డాక్టర్ కొచ్చర్ల సురేష్‌కు జాతీయ ప్రతిభా పురస్కార అవార్డును ప్రదానం చేశారు. వరల్డ్ రైటర్స్ ఫోరం, ప్రపంచ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పురస్కారాలను మంగళవారం విజయవాడలో సురేష్‌కు ఢిల్లీ దూరదర్శన్ డైరెక్టర్ పద్మవిభూషన్ బోయి భీమన్న దంపతులతోపాటు పలువురు కవులు, కళాకారులు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవలు అందచేసినందుకు తన సేవలను గుర్తించి అవార్డును అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలు ఉపాధి సృష్టి కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

అమర్చిన తర్వాత దానికి సంబంధించిన ఫోటోలు తనకు పంపించాలని లైబ్రేరియన్ రుక్మిణిని ఆదేశించారు. అనంతరం సుదిమళ్లలో ట్రైబల్ రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. 25 వరకు పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్సీవో నాగార్జునరావు, ఏటీడీవో రాధమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, ఏఈ సాలార్, రాజు, లైబ్రేరియన్ రుక్మిణి, ప్రిన్సిపాల్ మాధవి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కూరగాయలతో వంట

(5వ పేజీ తరువాయి)

వంటలు చేస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధరలు పెంచినా మార్పులేదు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు నుంచి పెంచిన ధరలను అమలు చేస్తోంది. గతంలో ఒక్కో విద్యార్థికి ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.8.17 ఉండగా, ప్రస్తుతం రూ.9.29, ప్రాథమిక పాఠశాల్లో రూ.5.45 ఉండగా ప్రస్తుతం రూ.6.19 పైసలు చేశారు. గుడ్డుకు అదనంగా రూ.5లు అందిస్తారు. ఐనా కొందరు మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు అందించే భోజనంలో కుళ్లిన కూరగాలు, మురిగిన కోడిగుడ్లను అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నో సందర్భాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నా అధికారులు ఆ ఒక్క రోజు మాత్రమే హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరంతర నిఘా అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, కేజీబీవీల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలు, మధ్యాహ్న భోజనంపై జిల్లాస్థాయి అధికారులు నిరంతర నిఘా చేస్తేనే నాణ్యమైన భోజనం అందించేందుకు అవకాశం ఉంటుంది.

వారంలో ఒకరోజు అధికారులు వచ్చి వెళ్లినంత మాత్రాన మార్పు రాదని, నిరంతరం నిఘా పెడితేనే భోజనం తయారీలో మార్పువస్తుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు అప్రజాస్వామికం

(5వ పేజీ తరువాయి)

విదేశీయులు కాదన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు కారణంగానే తిరుగుబాటుదారులుగా మారుతారనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. శత్రుదేశాలపై చేసే స్థాయిలో ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలను దింపి అశాంతిని నెలకొల్పుతున్నారని ఆరోపించారు.

బీజాపూర్, కాంకర్, గంగులూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లను పోటు రంగారావు ఖండించారు. అమరవీరులకు జోహర్లు అర్పించారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.20కోట్లు

(5వ పేజీ తరువాయి)



రూ.2కోట్ల, 29లక్షల, 47వేలు, సత్తుపల్లి డిపో నుంచి రూ.3కోట్ల, 73లక్షల, 25వేలు, భద్రాచలం డిపో నుంచి రూ.3కోట్ల, 99లక్షల, 5వేలు, కొత్తగుడెం డిపో నుంచి రూ.2కోట్ల, 22లక్షల, 6వేలు, మణుగురు డిపో నుంచి రూ.3కోట్ల, 2లక్షల, 32వేలు, ఇల్లెందు డిపో నుంచి రూ.60లక్షల, ఒక వెయ్యి మొత్తం రూ.20కోట్ల, 73లక్షల, 48వేల ఆదాయం సమకూరిందని ఆర్ఎం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఆర్ఎం డిపో మేనేజర్లను, ఉద్యోగులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరి కృషివల్లనే ఆదాయం పెరిగిందని, రానున్న రోజుల్లో ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మార్చి 30నుంచి భద్రాద్రిలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 30 నుంచి వసంత పక్షప్రయుక్త శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది రోజున బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం, నూతన పంచాంగ శ్రవణంతో వసంత పక్ష ప్రయుక్త తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 6న శ్రీరామనవమి రోజు మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల తిరుకళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అదేరోజు శ్రీరామ పునర్వసు దీక్షప్రారంభం కానుంది. 7న శ్రీరామ మహాపట్టాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 2న ధ్వజపట లేఖనం, 3న గరుడాదివాసం, 4న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు. కాగా 8న సదస్యం, 12న చక్రతీర్థం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణములు, ద్వాదశ ఆరాధనలు, శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 12 వరకు నిత్యకళ్యాణాలు, దర్బారుసేవ, పవళింపుసేవలకు విరామం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 22న నూతన పర్యంకోత్సవం నిర్వహిస్తారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో నిర్లక్ష్యం..

ప్రయాణికులకు ప్రాణసంకటం

వైరా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుండటంతో ప్రయాణికులకు ప్రాణసంకట పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వైరా-నెమలి రూట్లో స్టేజీ పినపాక-సిరిపురం గ్రామాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింద రోడ్డుకు ఒకవైపు రెండు అడుగుల లోతులో ఏర్పడిన గుంతను పూడ్చకుండా వదిలేశారు. ఆగుంతలోకి నీరు చేరింది. ఈ రూట్లో నడిచే వాహనచోదకులు ఈ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింద రోడ్డు మొత్తం గతుకులు, గుంతలతో నిండి ఉంది. ఓవైపున రెండు అడుగుల లోతులో ఉన్న గుంత వాహనచోదకులకు దగ్గరకు వచ్చేవరకు కన్పించడం లేదు. సాధారణ రోడ్డుగానే భావించి యథావిధిగా ప్రయాణికులు వచ్చి వాహనాలతో సహా గుంతలో పడిపోతున్నారు. రోజులతరబడి గుంత ఉన్నప్పటికీ కనీసం గ్రావెల్ కూడా పోయడం లేదు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన పదుల సంఖ్యలో టిప్పర్లు ఇతర వాహనాలు రోడ్డు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌తో తిరుగుతున్నప్పటికీ ఈ గుంతను గురించి పట్టించుకోవడం లేదు. కొద్దిపాటి మెటీరియల్‌తో ఆగుంతను పూడ్చకుండా వదిలేశారు. అంతేకాకుండా ఈ అండర్‌పాస్ వంతెనకు రెండువైపులా విపరీతమైన దుమ్ము లేస్తూ ప్రయాణీకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ రోడ్డులో గుంతలపై పర్యవేక్షణ చేయాల్సిన వైరా ఆర్‌అండ్‌బీ సెక్షన్ అధికారి, సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు, స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులు ఇక్కడ ఉన్న గుంతలు, గతుకులకు మరమ్మతులు చే యించాలని ఈ రూటు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వైరా-నెమలి రూట్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింద ప్రమాదకరంగా ఉన్న గుంత

ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ లభించేనా?

» రేపు భద్రాద్రి జిల్లాకు రానున్న కేంద్ర సర్వే బృందం
» ఏర్పాట్లు చేసిన అధికారులు
» కొత్తగూడెం ప్రాంతంలో 950 ఎకరాలు సిద్ధంచేసిన అధికారులు
» రూపుమారనున్న కొత్తగూడెం

కొత్తగూడెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం గరీబ్‌పేట గ్రామాల మధ్య ఉన్న 950 ఎకరాల ప్రభుత్వ భూమిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన కోసం గురువారం ఏఏఐ కేంద్ర సర్వే బృందం రానున్నారు. ఈ స్థల పరిశీలన నిమిత్తం ఖర్చుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.38లక్షల నిధులను విడుదల చేసింది. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రాంమోహన్‌నాయుడును ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్ ద్వార కేంద్ర సర్వే బృందాన్ని స్థల పరిశీలన నిమిత్తం పంపించాలని కోరారు. దీంతో కేంద్రమంత్రి వెంటనే స్పందించి తప్పని సరిగా ఈ నెల 23న కేంద్ర సర్వే బృందాన్ని పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు కేంద్ర సర్వే బృందం కొత్తగూడెం వచ్చేందుకు సర్వం సిద్దంచేసుకుంది. ఈ నేపథ్యంలోనే కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం గరీబ్‌పేట గ్రామాల ప్రాంతాల్లో 950ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. కేంద్ర బృందం రావడంతో ఆ భూమిని పరిశీలించి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను సర్వే సభ్యులు పూర్తిస్థాయిలో పరిశీలించనున్నారు. కొత్తగూడెం ప్రాంతంలోనే కాకుండ పాల్వంచలో ఈ సర్వే బృందం పర్యటించనున్నట్లు సమాచారం. అక్కడ కూడ భూమిని గుర్తించారు. ఆ ప్రాంతంలో కూడ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకునేందుకు కూడ కేంద్ర బృందం పరిశీలించనున్నారు. అంతకుముందు తుమ్మల నాగేశ్వరరావుతోపాటుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వేర్వేరుగా కేంద్రమంత్రి రాంమోహన్‌నాయుడుకు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టును ఏర్పాటుచేయాలని కోరుతూ లేఖ రాశారు. ఈ లేఖతో మంత్రి స్పందించి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నెలకొల్పుతామని వారికి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మంత్రి తుమ్మలతోపాటుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతుందని కూడ తప్పని సరిగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని కూడ హామీ ఇచ్చారు. మొత్తం మీద కొత్తగూడెం పట్టణానికి ఎయిర్‌పోర్టు నిర్మిస్తే మరింత మహర్దశ కలుగుతుంది. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఈ ప్రాంతం అనువైందిగా ఉంటుందా.. లేదా దాని సాధ్యాసాధ్యాలు నిర్ధారించేలా సర్వే జరిపిన తర్వాత ఆ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టనుంది.

సర్వే బృందంలో ఆరుగురు సభ్యులు

కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ఎయిర్‌పోర్టు సాధాసాధ్యాల పరిశీలనకు ఆరుగురు సభ్యుల ప్రత్యేక బృందం రానున్నారు. ఈ బృందంలో ఏరోప్లానింగ్ ఇంజనీరు అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్ మహ్మద్ సఖీబ్, ఆపరేషన్ ఇంజనీర్ ప్రశాంత్ గుప్త, సీఎన్ఎస్ ఆర్. దివాకర్, ఇంజనీరు మణీష్ జోస్వర్, ఎఫ్‌డీఈ ప్రవీణ్ ఉన్నికృష్ణన్ వస్తున్నారు. ఇప్పటికే ఈ బృందం పర్యటనకు కావాల్సినటువంటి అన్ని ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ బృందం కోరిన విధంగా రెవెన్యూ డిపార్టుమెంట్ భూసేకరణ, ఫారెస్ట్, వాటర్ రీసోర్సెస్, ఏవియేషన్ బృందాన్ని అందుబాటులో ఉంచేందుకు ఇప్పటికే కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఏర్పాటు చేశారు. ఈ బృందానికి కావాల్సిన సమాచారాన్ని ఇచ్చే విధంగా సంబంధిత విభాగాల అధికారులందర్ని సైతం కలెక్టర్ సిద్ధం చేశారు. రెవిన్యూ యంత్రాంగం వారి పర్యటనకు ఏర్పాట్లు చేసింది.

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే..

కొత్తగూడెంలో అన్ని బాగుండి కేంద్ర సర్వే బృందం సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిపితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రూపురేఖలన్నీ మారి వేగవంతంగా అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల రూపురేఖలు వేగంగా మారిపోతాయి. జిల్లాలో ప్రధానంగా సింగరేణి సంస్థ కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో బొగ్గు బావులు నిర్మాణం చేపట్టి బొగ్గు సరఫరా చేస్తోంది. అదేవిధంగా పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కర్మాగారం, నవభారత్, ఎన్ఎండీసీ, అశ్వాపురంలోని భార జల కర్మాగారం (హెవివాటర్ ప్రాజెక్టు), భద్రాచలం సారపాకలోని ఐటీసీ బీపీఎల్ కంపెనీ, మణుగూరులోని బీటీపీఎస్ కర్మాగారంతోపాటుగా పలు పరిశ్రమలతో ఇప్పటికే అభివృద్ధిలో ఉంది. ఆ పరిశ్రమల్లో పని చేస్తున్న అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు విమానాశ్రయం ద్వార ప్రయాణం సులభతరంగా ఉంటుంది. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లే విద్యార్థులకు కూడ హైదరాబాద్ వెళ్లకుండ ఇక్కడి నుంచే విమానంలో వెళ్లేందుకు అవకాశాలు ఉంటాయి. విమానాశ్రయ కేంద్రానికి జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులను సైతం అనుసందానం చేస్తారు. దాంతో రోడ్ల సైతం విస్తరించి అభివృద్ధి జరుగుతుంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పారిశ్రామిక ఔత్సాహికులు వచ్చి ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు కూడ అవకాశాలు ఉంటాయి. వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వాణిజ్యపరంగా, పర్యాటక పరంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తోంది. దక్షణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం సీతారామాలయానికి దేశ విదేశాల భక్తులు పర్యాటకులు సైతం వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుంది. దీంతోపాటుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ప్రయాణీకులు సైతం విమానాశ్రయం ఉపయోగించడం వల్ల రాకపోకలు సులువుగా ఉంటాయి.

గురుకులాల్లో ప్రవేశాల పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్, జనవరి21(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ప్రవేశాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం వచ్చేనెల 1లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఇంగ్లీష్ మీడియం గురుకులాల్లో ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6నుండి 9వ తరగతుల్లో, గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలలో 9వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అలాగే టీజీ టీడబ్ల్యుఆర్ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలలో 8వతరగతి ప్రవేశాలకు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైనాన్స్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డ్, జనన ధృవీకరణ ధృవపత్రం, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశపరీక్ష వచ్చే నెల 23న ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలి

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీఎస్పీ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి21(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను నియంత్రించటంలో విద్యార్థులు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్‌మార్కెటింగ్ నియంత్రణలో విద్యార్థులు పౌరబాధ్యతతో పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రామునాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. యూఆర్ఎస్,ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసుపెంపు, ఆర్థిక సమస్యలకు పరిష్కారం కాదన్నారు. రిటైర్‌మెంట్ పెంపు సరైంది కాదని, ఈ ప్రతిపాదన విరమించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు ఈకార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నపై కత్తితో దాడి చేసిన తమ్ముడు

ఖమ్మంరూరల్,జనవరి21(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారమ్ విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన పరిధిలోని కస్నాతండాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భూతం వీరబాబు, భూతం వెంకన్న ఇద్దరు అన్నదమ్ములు... వీరబాబు వాల్యాతండా లోని నివాసం ఉంటున్నాడు. కోళ్లఫారమ్ విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణలు జరిగింది. మంగళవారం వీరబాబు సోదరిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వాల్యాతండా నుంచి కస్నాతండాకి వెళ్లాడు. అక్కడ అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈక్రమంలో వెంకన్న తన అన్నపై కారం చల్లి కత్తితో దాడి చేశాడు. వీరబాబు తీవ్రంగా గాయపడ్డాడు.గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. వీరబాబు సతీమణి జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ మూడు గ్రామాల్లో సోలార్ వెలుగులు

- పైలట్ ప్రాజెక్టు లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపిక
- ఖమ్మంలో చెర్వుమాధారం, రఘునాథపాలెం గ్రామాల ఎంపిక
- భద్రాద్రి జిల్లాలో గండుగులపల్లి ..
- గృహ, వ్యవసాయానికి వినియోగం
- మిగులు విద్యుత్ అమ్మకం





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే, చెర్వుమాధారంలో మాట్లాడుతున్న విద్యుత్ ఖమ్మం ఎస్ఈ సురేందర్

దమ్మపేట, జనవరి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం మోడల్ సోలార్ విలేజ్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో నివాసాలకు, వ్యవసాయానికి 100శాతం సోలార్ పవర్‌ను వినియోగించనున్నారు. ఈవివరాలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గండుగులపల్లిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ గ్రామంలో 100శాతం గృహాలకు వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగించుకునేందుకు పైలట్‌ప్రాజెక్టు ఎంపిక చేశారని చెప్పారు. తద్వారా లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లికుండా ప్రభుత్వమే ఖర్చును భరించి సోలార్ విద్యుత్ సిస్టం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గ్రామంలో ఉత్పత్తి అయిన సోలార్ పవర్ ను వినియోగదారుల నుంచి మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. సోలార్ ఏర్పాటు వల్ల ప్రతీ కుటుంబానికి సంత్సరానికి రూ.3వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. విద్యుత్‌శాఖా ఎస్ఈ మహేందర్ మాట్లాడుతూ గ్రామంలో 387 విద్యుత్ సర్వీసులు ఉన్నాయన్నారు. ఇప్పటికే 333 నివాసాలకు సోలార్ ఏర్పాటుపై సర్వే చేశామన్నారు. విగతావారి వివరాలు సేకరించి అన్ని నివాసాలకు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, తుమ్మల శేషుబాబు,సుశీలారాజేష్, డీఈ నందయ్య, ఏడీఈ వెంకటరత్నం, ఏఈలు రమేష్, రవి సంతోష్, సాయి కిరణ్, వెంకటేశ్వర్లు,విజయ్‌శంకర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి...
చెర్వుమాధారంలో ఖమ్మం ఎస్ఈ సురేందర్

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో చెరువు మాధారం గ్రామాన్ని సోలార్‌పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ప్రభుత్వం ఎంపిక చేసిందని విద్యుత్ ఎస్ఈ సురేందర్ చెప్పారు. మంగళవారం విద్యుత్ శాఖాధికారులు చెర్వుమాధారంలో నిర్వహించిన సభలో ఎస్ఈ మాట్లాడారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఉచితంగా సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తారన్నారు. గ్రామస్తులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, విద్యుత్ బిల్లు జిరాక్స్‌లతో పాటుగా ఫోన్‌నెంబరు, పాస్ పోర్టు సైజుఫోటోలు ఇవ్వాలన్నారు. బుధవారం నుంచి గ్రామంలో సోలార్‌ప్రాజెక్టుకు సంబంధించిన సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్, ఏఈ రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోలార్ గ్రామంగా రఘునాథపాలెం
సర్వే ప్రారంభించిన ఎస్ఈ

రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గంలో నూరు శాతం సోలార్ గ్రామంగా రఘునాథపాలెం గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం టీజీ ఎన్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఏ సురేందర్ ఆధ్వర్యంలో రఘునాథపాలెంలో సర్వే ప్రారంభించారు. గ్రామంలోని 2,100నివాస విద్యుత్ మీటర్లుతో పాటుగా 290 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై సర్వే చేపట్టారు. విద్యుత్‌శాఖ ఎస్ఏవో శ్రీధర్, డీగీ నంబూరి రామారావు, ఏఈలు శంకర్‌లు పాల్గొన్నారు. రెడ్‌కో జిల్లా మెనేజరు గైర్హాజరయ్యారు.

ముగిసిన పోలీసు వార్షిక క్రీడలు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన సీపీ

ఖమ్మంక్రైం, జనవరి20(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా ఖమ్మం నగరంలోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు క్రీడలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలను జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా పోలీసుకమిషనర్ సునీల్‌దత్ హాజరై 100మీటర్ల పరుగుపందెం తిలకించారు. అనంతరం క్రీడాకారుల నుంచి సీపీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్పోర్ట్స్ మీట్‌కు ప్రతీకగా సూచించే పోలీసు క్రీడా పతకాన్ని సీపీకి క్రీడాకారులు అందించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో పోలీసింగ్ అనేది చాలా సవాల్‌తో కూడిందన్నారు. అలాంటి చాలెంజ్‌లను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలందించాలంటే శారీరక ఆరోగ్యం కలిగి ఉండడం సిబ్బందికి కీలకమన్నారు.ఈస్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత చాంపియన్‌గా సీఏఆర్ కానిస్టేబుల్ జి.గణేష్, మహిళ కానిస్టేబుల్ ఎల్.భవాని నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా సీటీ ఆర్మడు రిజర్వు జట్టు నిలిచింది. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ సీపీ అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, కుమారస్వామి, విజయబాబు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహమాన్, సాంబరాజు, రవి, ఫణీందర్, వెంకటేష్, సర్వర్, నరసయ్య, సుశీల్‌సింగ్ పాల్గొన్నారు.




విజేతలతో సీపీ సునిల్‌దత్, టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న సీపీ

జెన్కో క్రీడా పోటీలు ప్రారంభం

పాల్వంచ, జనవరి21(ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేటీపీఎస్ 5,6 దశల ఆధ్వర్యంలో జెన్కో వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్ ప్రాజెక్ట్ హాకీ, బాస్కెట్ బాల్ టోర్నమెంట్స్ పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని విద్యుత్ కళాభారతి క్రీడాప్రాంగణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. 5,6దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగే ఈటోర్నమెంట్స్‌ను 5,6 దశల సీఈ ప్రభాకరరావు, 7వదశ సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు ప్రారంభించారు. జెన్కో వ్యాప్తంగా ఆరు విద్యుత్‌కేంద్రాల జట్లు పాల్గొంటున్నాయి. మొదటి రోజు జరిగిన హాకీలో స్థానిక 5,6దశల జట్టు బీటీపీఎస్ జట్టుపై విజయం సాధించింది. అదేవిధంగా భూపాలపల్లి కేటీపీఎస్ 7వదశ జట్లకు మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. రెఫరీలుగా ఆరీఫ్, ఇలియాజ్ వ్యవహరించారు.కార్యక్రమాన్ని స్పోర్ట్స్ కౌన్సిల్ బాధ్యులు లోహిత్‌ఆనంద్,వీరస్వామి, మహేష్, రాజు, మోక్షవీర్ పర్యవేక్షించారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సీఈలు

నేడు ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ క్రీడలు

చుంచుపల్లి: ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ క్రీడలుబుధవారంనుంచి రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమవుతాయని ఉమ్మడి జిల్లాల కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈజిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు రెండు రోజుల పాటు ఇండోర్, ఔట్‌డోర్ క్రీడాపోటీలు వివిధ విభాగాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు 80మంది ఉపాధ్యాయులు, 20మంది వలంటీర్లు పాల్గొంటారని చెప్పారు.

కేటీపీఎస్ ఆర్టిజన్ ఆత్మహత్య

పాల్వంచ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేటీపీఎస్ 5,6 దశల బాయిలర్ విభాగంలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన పులికంటి మనోహర్(37) స్థానిక కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి మణుగూరు వైపు ప్రయాణిస్తున్న లైట్ ఇంజన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూలి పనుల కోసం సత్తుపల్లికి వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన గొల్ల మందల పుల్లయ్య (40) పట్టణంలోని గాంధీనగర్ రోడ్ నెం.6లో డేవిడ్ కే దానియేలు ఇంటిలో పనికి వచ్చాడు. మధ్యాహ్నం భోజనానంతరం నీటిసంపు వద్దకు వెళ్లి నీటిని తోడుతున్నాడు. కొద్దిసేపటి తర్వాత తోటి కూలీలు గమనించగా నీటిసంపులో అచేతనంగా పడి ఉన్న పుల్లయ్యను వెంటనే బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిన ట్లు తెలిపారు. మృతుడికి గతంలో ఫిట్స్ ఉండటంతో పనిచేస్తున్న క్రమం లో నీటిలో పడి ఊపిరాడక మృతి చెందినట్లుగా బంధువులు చెబుతున్నా రు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా ఆసుపత్రి వద్ద మృతుని బంధువుల ఆర్తనాధాలతో చూసిన వారిని కంటతడి పెట్టించింది.



పుల్లయ్య(ఫైల్)

మూగజీవాల రోదన

- ఆగని వన్యప్రాణుల వేట
- పట్టించుకోని అధికారులు
- మూగజీవాలను కాపాడాలని జంతుప్రేమికుల వినతి

మణుగూరటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): వేటకు అమాయకపు అటవీ జీవాలు బ లైపోతున్నాయి. వన్యప్రాణులకు చంపోద్దని చంపితే నేరమని చెప్పే చట్టాలు భద్రంగా కా గితాల్లో నిద్ర పోతున్నాయి. క్రమ క్రమంగా అవి తరిగిపోతూ అరుదై కనుమరుగై పోతున్న జాతి జంతువులు పెద్ద పులులు, వేటగాళ్ల ఉచ్చుల్లో చిక్కుకుని మరణించిన సంఘటనలు కోకల్లలు.

ఎండాకాలం రాగానే తాగే నీరు కరువై దాహంతో తల్లడిల్లుతూ జనావాసాల దగ్గరకు చేరే మూగ జీవాలను వేటాడుతున్నారు. అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామాల్లో జంతువుల వేటగాళ్లు తయారై దీన్ని ఓ వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. అంటే ఎన్నో వందల వన్యప్రాణాలు వీరి కూరత్వానికి బలైపోతున్నాయో ఊహించవచ్చు. మణుగూరు, బయ్యారం, కరకగూడెం, ఇల్లెందు, చర్ల మొదలైన అటవీ ప్రాంతాల్లో జంతువుల వేట ముమ్మరంగా బాహాటంగా సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. గతంలో వేటగాళ్ల అమర్చిన ఉచ్చుల్లో చిక్కి మనుషులు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. దుప్పులు జింకలు అటవి పందులు, కుందేళ్లు, ఉడుములు, అడవి గొర్రెలు దున్నలు వేటగాళ్ల దాహానికి బలవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే తప్ప వన్య ప్రాణులు అడవిలో కనిపించవనడంలో ఏమాత్రం సందేహం లేదు.

వన్యప్రాణులను కాపాడాలి

అటవీ శాఖవారు వన్య ప్రాణులను రక్షించడంలో వన్య ప్రాణాలను రక్షించడంలో వైఫల్యం చెందారన్న విషయం అర్థమవుతుంది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ వివిధ రకాల వేటగాళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణ ప్రాంతానికి విక్రయానికి వచ్చిన దుప్పి మాంసం

దుప్పి మాంసం పట్టివేత

మణుగూరు మండలంలోని కూనవరం గ్రామం రైల్వే గేట్ సమీపంలో సోమవారం సాయంత్రం దుప్పి మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు దాడులు చేశారు. ఇందుకు సంబంధించి ఫారెస్టు డివిజన్ అధికారి సయ్యద్ మక్సూద్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ దాడుల్లో రైల్వే గేట్ ప్రాంతంలో ఓ కూల్‌డ్రింక్ షాపు నిర్వహించే బోశెట్టి కౌసల్య వద్ద రెండు కవర్లలో ఉన్న దాదాపు 2 కేజీల దుప్పి మాంసం లభ్యమైంది. తమ శాఖ రెంజర్ ఉపేందర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈమాంసం ఇక్కడికి ఎలా వచ్చిందన్న విషయంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరుపగా, పగిడేరు పంచాయతీ బుగ్గ గ్రామానికి చెందిన వజ్జా సారయ్య అనే నిందితుడు దొరికాడన్నారు. అతడని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపామని తెలిపారు. ప్రతి గ్రామంలో జంతువులను వేటాడి చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. సమాచారం అందిస్తే వేటగాళ్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ మోసాల భారీన పడకండి: ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్‌గా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్‌కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మంగళవారం తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని మళ్లీ మల్టీలెవల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్లీ ప్రారంభమయ్యాయని, గొలుసుకట్టుగా అమాయకులను వల వేసి మోసం చేస్తున్నారని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ విధమైన మోసాలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో అఫర్లు పెట్టి ప్రజల నుంచి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త మోసాలతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారన్నారు. తక్కువ మందికి లాభాలు చూపించి మిగిలిన అందరి సొమ్ము కొల్లగొడతారని తెలిపారు. ఇలాంటి నూతన స్కీంలు, నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి సంబంధం లేని వారు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చేయరనే విషయాన్ని గ్రహించాలని తెలిపారు. 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కానీ మీ సమీప పోలీస్‌స్టేషన్‌లోనైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత త్వరగా వారు కొల్పోయిన నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు.

సారా విక్రయదారులపై బైండోవర్ కేసులు

జూలూరుపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాటుసారా తయారీదారులు, విక్రయేతలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్‌రావు శుక్రవారం తెలిపారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని గోపాతండాకు చెందిన గుగులోత్ వెంకటేష్, బాణోత్ చిలికి, గురవాగుతండాకు చెందిన గుగులోత్ కైకా, వాంకుడోత్ సుజాత, గిద్దలగూడేనికి చెందిన బాణోత్ హతిరాం, తవిశిగుట్టలో బోడా బాలు, మాచినేనిపేటకు చెందిన మూడు వాల్యా, గుళ్లరేవుకు చెందిన భూక్యా పద్మ 8మంది సారా తయారీ, విక్రయదారులతో పాటు వెంగన్నపాలేనికి చెందిన వ్యాపారి మిట్టపల్లి మణికంఠపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. ఒక్కొక్కరు పూచికత్తుగా రూ. 2లక్షల బాండ్లను సమర్పించారన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 12మంది జూదరుల అరెస్టు
- రూ.77,600నగదు స్వాధీనం

తల్లాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 12మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని అన్నారుగూడెం కాటన్‌పార్కు, ముక్కపోచమ్మ దేవాలయం సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.65వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తల్లాడ రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి మరో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ.12,660 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణంలోని గుట్టల బజారు ప్రాంతానికి చెందిన ఏ.మోహన్‌రావుకి చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.1లక్షా 75వేలను నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం మద్యపాన అబ్కారి ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు.. ఖమ్మం పట్టణం పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతానికి చెందిన ఫిర్యాది వసికర్ల బాలరాజు వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2012లో రూ.3లక్షలను అప్పుగా తీసుకొని, అదేరోజు ప్రాంసరీ నోటు రాయించి ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా నిందితుడు 2015లో రూ.లక్షా 75వేలకు చెక్కు జారీ చేసినాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకుఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కుతిరస్కరణకు గురైనది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

లబ్ధిదారులను మభ్యపెట్టేందుకే గ్రామసభలు

- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మంటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని. అందులో భాగంగా లబ్ధిదారులను మభ్యపెట్టేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలను ఇచ్చి ఎన్నికల్లో గెలిచిందని, వాటిని అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టిస్తున్నదన్నారు. మొదట కాళేశ్వరం ప్రాజెక్ట్, తరువాత ఈ-ఫార్ములా కార్‌రేసింగ్, మాజీ మంత్రులు కేటీఆర్, కేసీఆర్‌పై కేసులు, ఇలా పలు సమస్యలను సృష్టించి, హామీలు అడగకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేరని, లగచర్ల సంఘటనలో ఇంత వరకు గిరిజనులను జైలు నుంచి విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై నాన్‌బెయిల్ కేసులు పెట్టడం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పాతర వేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, పడగాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, శీలంశెట్టి వీరభద్రం, బెల్లం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని ఆహారం

- అదనపు కలెక్టర్ తనిఖీలో వెలుగు చూసిన నిజాలు

చంద్రుగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : చంద్రుగొండ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అంది అందని ఆహారంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం మంగళవారం పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విద్యాచందన తనిఖీల్లో వెలుగు చూసింది. అదనపు కలెక్టర్ పాఠశాల, హాస్టల్ గదులతో పాటు ఆహార పదార్థాలను పరిశీలించారు. అన్నం ముద్దగా ఎందుకు ఉందని సిబ్బందిని అడగగా కొత్త బియ్యం కావడంతో ముద్దగా ఉందని తెలిపారు. విద్యార్థులకు భోజనంలో ఇచ్చే గుడ్డు, తోటకూర పప్పు, టమాటో కూర, రసం, పెరుగు ఆహారాల ఏవి అని పాఠశాల ప్రత్యేక అధికారిని ప్రశ్నించారు. గుడ్లుతో పాటు కొన్ని కూరగాయలు అందుబాటులో లేక పెట్టలేదని, సాయంత్రం ఇచ్చే భోజనంలో పెడతామని సదరు అధికారి సమాధానం ఇచ్చారు. ఇదే సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా టమాటో కూర అయిపోయింది. దీంతో విద్యార్థులు ఏదోలా భోజనం ముగించారు.

ముద్దగా ఉన్న అన్నం, చాలీచాలని కూరలు, పెరుగు స్థానంలో నీళ్లను తలపించే మజ్జిగా ఇస్తున్న ఘటన అదనపు కలెక్టర్ లాంటి ఉన్నతాధికారికి కళ్లకి కట్టినట్టు కనిపించినా ఎందుకనో పెద్దగా స్పందించలేదు. దీనిపై అదనపు కలెక్టర్‌ను వివరణ కోరగా వివరాలన్ని వారినే(పాఠశాల ప్రత్యేక అధికారినే) అడగండి అని సమాధానం ఇచ్చారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన (ఇన్‌సెట్‌లో విద్యార్థులకు పెట్టిన భోజనం)



నేడు 'నింగినిండా ఎర్రజెండా' సీడీ ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం ప్రముఖ కవి, తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ కటుకోజ్వల ఆనందచారి రచించిన ప్రచార గీతాల సీడీని బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలోని మంచి కంటి హాల్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడుపోతినేని సుదర్శన్ , ప్రముఖ విద్యావేత్త రవిమారుత్‌లు ఆవిష్కరించనున్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నామా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.దేవేంద్ర తదితరులు పాల్గొననున్నారు.

బోదులబండ పీహెచ్‌సీ తనిఖీ

నేలకొండపల్లి,జనవరి21(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని బోదులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బి.కళావతీబాయి మంగళవారం తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు. రోగులకు అందుబాటులో ఉండాలని, నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. వైద్యాధికారి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ విస్తా 'ఉడాన్' పోటీల పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మంస్పోర్ట్స్, జనవరి21(ఆంధ్రజ్యోతి): ఈనెల 24, 25 తేదీల్లో శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో 'ఉడాన్' క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల యజమాన్యం తెలిపింది. మంగళవారం పోటీల వాల్‌పోస్టర్‌ను పాఠశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, డీజీఎం చేతన్ మాధుర్ ఆవిష్కరించారు. ఓపెన్ ఉడాన్ క్రీడోత్సవాలకు ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత సిక్కిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వారు తెలిపారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయసుధ, ఏజీఎం బ్రహ్మం ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

తిరుమలాయపాలెం, జనవరి21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలసమయలో దళితుల ఇచ్చిన హామీలు అమలుచేయాలని కేవీపీఎస్ రాష్ట్రనాయకుడు పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా సోమపొంగు రాము, కార్యదర్శిగా మహేందర్ తదితరులతో కమిటీ ఎన్నుకున్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

తిరుమలాయపాలెం, జనవరి21(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలోని అవగాహన కలిపించారు. రవాణశాఖ అధికారులు గోపీకృష్ణ, సుమలత విద్యార్థులకు అవగాహన కలిగించారు.ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్, వసతిగృహ సంక్షేమ అధికారి రమాదేవి పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా మొదటి సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు ఉత్తవ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.సీఎస్‌సీ విభాగంలో నలుగురు, ఈసీఈలో ముగ్గురు, ఈఈఈలో ఇద్దరు 9.8మార్కులు సాధించారని తెలిపారు. సీఎస్‌సీలో 11మంది, ఈసీఈలో ఏడుగురు,ఈఈఈలో నలుగురు 9.5 మార్కులు సాధించారని చెప్పారు.

ఆశాల పాదయాత్ర

ఖమ్మంటౌన్,జనవరి21(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు స్థిరవేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్,ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణా ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు.ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వేంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు పీ.రమ్య, శీలంనర్సింహారావు, చంద్రశేఖర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంగమ్మ, కార్యదర్శి అమల పాల్గొన్నారు.









మంచుకొండ సభలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గట్టుసింగారంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు, మాట్లాడుతున్న మేయర్ నీరజ

జాబితాలో మా పేర్లు ఎందుకు లేవు?



మూడోడివిజన్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

- డివిజన్ సభల్లో అధికారులను ప్రశ్నించిన ప్రజలు
- బయటపడిన ప్రజాపాలన ఆన్‌లైన్ లోపాలు
- తొలి రోజు 20డివిజన్లలో బహిరంగ సభలు
- 6వ డివిజన్ సభలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పాలేరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అనేక పర్యాయాలు సంక్షేమ పథకాలు కోసం దరఖాస్తులు చేశాం. మా ఇళ్లకు వచ్చి సర్వేలు చేశారు. కానీ ఇప్పుడు మీరు చెపుతున్న జాబితాలో మా పేర్లు లేవు.. ఎందుకని అంటూ డివిజన్ బహిరంగ సభల్లో అధికారులను ప్రజలు నిలదీశారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం, సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్‌కార్డుల కోసం తాము చేసిన దరఖాస్తులు ఏమీ చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కోసం మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థలో ప్రారంబించిన డివిజన్ మహాసభలు ప్రజల ఆందోళన నడుమ కొనసాగాయి. 3వ డివిజన్ బల్లేపల్లి సభలో ప్రత్యేక అధికారి శివలింగం మీదకు కొంతమంది దూషణగా మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు మలీదు మనీష్ జోక్యం చేసుకొని సర్వే చేయించి న్యాయం చేస్తామని నచ్చచెప్పటంతో ప్రజలు శాంతించారు. 6వ డివిజన్ బహిరంగ సభలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అమలులో ఎటువంటి దాపరికాలు లేవన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాతనే గ్రామసభలు జరుగుతున్నాయన్నారు. అనర్హులకు పథకాలు అందితే విచారణ చేసి తొలగిస్తామన్నారు.

ఫొటోలకే పరిమితమైన ఇతరశాఖల అధికారులు

ఖమ్మం నగరంలో తొలిరోజు సభలకు ఇతర ప్రభుత్వశాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను పర్యవేక్షణకు కేటాయించారు. వారు కార్యక్రమం ప్రారంభంలో ఫొటోలు దిగి వెళ్లారు. ఎంతో కీలకమైన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల జాబితాలను గ్రామ సభలు ప్రకటించిన సమయంలో ఆయా శాఖల అధికారులు సభలో లేక పోవటంతో, మరింత గందరగోళానికి దారితీసింది. కాగా 1నుంచి 20 డివిజన్ల వరకు తొలిరోజు గ్రామ సభలు పూర్తి జరిగాయి. బల్లేపల్లిలో పోలీసులు జోక్యం వరకు వెళ్లగా మిగిలిన 19 డివిజన్లలో ప్రశాంతంగా ముగిశాయి. పట్టణ ప్రణాళిక అధికారి వసుందర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, టీఎంసీ సుజాత, ఏవో శివలింగం, ఆర్వో శ్రీనివాస్, దరణికుమార్, వజ్జా రామారావు డివిజన్ సభల ప్రత్యేక అధికారులుగా పర్యవేక్షణ చేశారు.రేషన్‌కార్డులు,ఇళ్లకువేలాదిగా దరఖాస్తులు అందాయి.

మంచుకొండ గ్రామసభకు పోలీసు కమిషనర్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా తొలిరోజు జరిగాయి. మంచుకొండతో పాటుగా చింతగుర్తి, దొనబొండ, గణేశ్వరం, కేవీ బంజర, కొయచెలక, మూలగూడెం, పుఠానితండా, శివాయిగూడెంలో గ్రామ సభలు జరిగాయి. మంచుకొండలో జరిగిన సభకు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ హాజరై శాంతిభద్రతలను తనిఖీ చేశారు. మాజీ సర్పంచి వాంకుడోత్ విజయదీప్లానాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరైనారు.

గ్రామసభల గందరగోళం

తిరుమలాయపాలెం:మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా సాగాయి. పిండిప్రోలు, వెదుళ్లచెరువు, తాళ్లచెరువు, బాలాజీనగర్‌తండా, అజ్మీరతండా, తదితర గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను అధికారులు ప్రకటించడంతో తమ పేర్లులేవని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పిండిప్రోలులో ఆర్డీవో నరసింహారావు మాట్లడుతూ ఈపథకాలు సంబందించిన జాబితాలో పేర్లు లేకపోతే తిరిగి దరఖాస్తు చేయాలని తెలిపారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మంరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామంలో జరిగిన గ్రామసభను కలెక్టర్ సందర్శించారు. ప్రాథమిక జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులు ఏమైనా ఉంటే చర్చ పెట్టుకోవాలని తెలిపారు. జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని మళ్లీ విచారణ చేయిస్తామన్నారు. ప్రస్తుత జాబితా, ప్రాథమిక జాబితా మాత్రమేనని తుదిజాబితా కాదని ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండాలని పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అర్హులందరికి పథకాలు అందుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అర్హులైన వారిని విస్మరించి పదుల సంఖ్యలో భూములు, ట్రాక్టర్లు, కార్లు ఉన్న ధనికులకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందిస్తారా అంటూ అధికారులను నిలదీతలు...ఆందోళనల మధ్యన మొదటి రోజు గ్రామసభలు జరిగాయి.. గోళ్లపాడు, తీర్దాల, ఆరెకోడు, చింతపల్లి, బారుగూడెం, కొండాపురం గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా తీర్దాలలో కొంతసేపు గ్రామ సభను రద్దుచేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీంతో ఆర్డీవో నరసింహారావు కలగజేసుకుని ప్రజలతో మాట్లాడారు లిస్టులో పేర్లు ఉండి వారు ధనికులైతే వారి పేర్లు తొలగించడం జరుగుతుందని పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు శాంతించారు.

గట్టుసింగారంలో జాబితా చించివేత

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామంలో ప్రజలు తీవ్రస్థాయిలో అధికారులను నిలదీశారు. ఆగ్రహంతో గోడకు అతికించిన అర్హుల జాబితాను కోపంతో చించివేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే నిలదీయడంతో చుక్కెదురైంది. జిల్లా సివిల్ డీఎం, మండల ప్రత్యేకాధికారి శ్రీలత అధ్యక్షతన గట్టుసింగారంలో గ్రామసభ ప్రారంభం కాగానే జాబితాలు చదవగానే గ్రామస్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. పెద్దఎత్తున భూములు, ఇళ్లు ఉన్న అనర్హులను ఎంపిక చేసి అనర్హులను ఎంపిక చేశారని సుమారు రెండు గంటల పాటు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అధికారులు ఎంపిక చేసిన జాబితాను అధికార కాంగ్రెస్ నాయకులే వ్యతిరేకిస్తూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈలోగా సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో చేరుకుని ఉద్రిక్త పరిస్థితి అదుపులోకి తెచ్చారు. స్పెషలాఫీసర్ శ్రీలత, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఏవో వాణి ప్రజలను శాంతిపచేసే ప్రయత్నం చేశారు. ఇది ఫైనల్ లిస్టు కాదని అభ్యంతరాలు ఉంటే చెప్పొచ్చని, సాంకేతిక లోపంతో అనర్హుల పేర్లు వచ్చాయని చెప్పారు. అర్హులుంటే వెంటనే పేర్లు ఇవ్వాలని చెప్పడంతో శాంతించారు. అదేవిధంగా నర్సింహలగూడెం, తుర్కగూడెం గ్రామాల్లోనూ పెద్దసంఖ్యలో అనర్హుల జాబితాలో చేర్చారని ఫిర్యాదుచేశారు.

గ్రామ సభల్లో దరఖాస్తుల వెల్లువ...

నేలకొండపల్లి: సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవటం నిరంతర ప్రక్రియని నేలకొండపల్లి ఎంపీడీఓయర్రయ్య అన్నారు. మంగళవారం మండలంలోని 13గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు గ్రామ సభలను నిర్వహించారు. గ్రామ సభల్లో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో అందాయి. మొత్తం 13 పంచాయతీలకు గాను 1550 వరకు దరఖాస్తులు అందినట్లు ఎంపీఓ శివ చెప్పారు. అత్యధికంగా చెన్నారం గ్రామంలో 308, అత్యల్పంగా కొంగర గ్రామంలో 20 దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

భగీరథ నీరు వృథా

ఆ వైపు కన్నెతి చూడని అధికారులు



ఖమ్మంరూరల్,జనవరి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోదాడ క్రాస్‌రోడ్డులో కొద్దిరోజులుగా రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం జేసీబీతో పనులు నిర్వహిస్తుండగా మద్దులపల్లి నుంచి వరంగల్ క్రాస్ రోడ్డువైపు వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ పగిలి పోయింది. పెద్దఎత్తున నీరు పొంగింది. వరదనీరు చిన్నపాటి కాలువను తలపించింది. ఇంతపెద్దఎత్తున నీరువృథాగా పోతున్నా ఆ శాఖా అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి)సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. తెలంగాణ మంగళవాద్యాల కళాకారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దర్గా సైదులు ఆధ్వర్యంలో ఖమ్మంలోని శృంగేరి మఠంలో మూడు రోజుల పాటు సప్తమ ఆరాధన ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి ఆరాధన, నాదస్వర వాద్య సంగీత కచేరి వంటివి నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీలంకకు చెందిన నాదస్వర కళాకారుడు ఆర్ వీ ఎస్ శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌ను పూలకిరీటంతో పల్లకిలో ఊరేగించారు.

పదో డివిజన్‌లో అపరిశుభ్రత

డ్రెయినేజీల్లో పిచ్చి మొక్కలు పెరిగి పాముల సంచారం

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు ఆదాయ వనరులు వర్షం కురిపించే డివిజన్లలో 10వ డివిజన్ ప్రథమస్థానంలో ఉంటుంది. ఐనప్పటికీ ఇక్కడ పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. చివరకు డ్రెయినేజీలో విషసర్పాలు తిరిగే పరిస్థితి ఏర్పడింది. అన్ని డివిజన్లు వలే పదోడివిజన్‌కు సమానంగా 10మంది పారిశుధ్య కార్మికులను కేటాయించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని మైదానం ఇదేడివిజన్‌లో ఉంటుంది. నిత్యం అనేక ప్రైవేట్ కమర్షియల్ సభలు, సమావేశాలు జరుగుతుంటాయి. ఆదాయాన్ని కాలేజీ నిర్వాహకులు తీసుకుంటున్నారు. మైదానాన్ని మాత్రం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయాల్సి వస్తోంది.ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోను ఇదే పరిస్థితి నెలకొంటోంది. దీంతో డివిజన్‌కు కేటాయించిన పదిమంది పారిశుధ్య కార్మికులు, ట్రాక్టర్‌తో సహా అక్కడే పారిశుధ్య పనులు చేస్తుండటంతో ట్యాక్స్‌లు చెల్లించిన ప్రజలు మాత్రం పారిశుధ్య లోపాన్ని ఎదుర్కొంటున్నారు. డ్రెయిన్లు కనీసం శుభ్రం చేయకపోవటంతో వాటిలో పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి.ఇప్పటికైనా కేఎంసీ అధికారులు డిగ్రీ కాలేజీ మైదానానికి, ప్రభుత్వ కార్యాలయాలకు అదనంగా పారిశుధ్య సిబ్బందిని ట్రాక్టర్‌ను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నెలరోజుల క్రితమే కమిషనర్‌కు లేఖ అందించాం: చావా మాధురి, కార్పొరేటర్



10వడివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉండటంతో డివిజన్‌కు కేటాయించిన పారిశుధ్య కార్మికులు ఆయా ప్రాంతాలకు వెళుతున్నారు. దీంతో పారిశుధ్య కార్మికుల కొరత ఏర్పడింది. అదనంగా కార్మికులు, ట్రాక్టర్‌ను కేటాయించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యకు నెలరోజుల క్రితమే లేఖ అందించాం. సమస్య పరిష్కారం కాలేదు.



పదోడివిజన్ 2వవీధి డ్రెయినేజీలో పెరిగిన పిచ్చిమొక్కలు

టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘాన్ని కలిసిన జిల్లా యూనియన్ కమిటీ

ఖమ్మంటౌన్,,జనవరి21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని టీఎన్‌జీవోఎ భవనంలో కేంద్ర సంఘ నాయకలను జిల్లా యూనియన్ నూతన కమిటీ నేతలు మంగళవారం కలిశారు. టీఎన్‌జీవోస్ కేంద్రసంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్‌లను కలిసి పుష్పగుచ్చం అందచేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీద్ నూతనంగా ఎన్నికైన టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్‌తో పాటు కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కేంద్రసంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, ఇరిగేషన్ ఫోరం రాష్ట్ర ట్రెజరర్ పూసపాటి శ్రీనివాస్, టీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు జైపాల్ విజయ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కొమరగిరి దుర్గాప్రసాద్, కోశాధికారి వల్లపు వెంకన్న పాల్గొన్నారు.



నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి, జనవరి21(ఆంధ్రజ్యోతి): పాలేరు శాసనసభ్యుడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నారు. మూటాపురంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేయటంతో పాటుగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంబిస్తారు. కోరట్లగూడెం, కోనాయగూడెం, పైనంపల్లి, అప్పలనర్సింహాపురం, కట్టుకాచారం, కొంగర, బుద్ధారం గ్రామాల్లో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు.

ఉత్సాహంగా 'సివిల్ సర్వీసెస్' క్రీడా పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి18(ఆంధ్రజ్యోతి):ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 248 మంది ఉద్యోగులు హాజరైనారు. ఉద్యోగులకుఅథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్ పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ట్‌ఫిజిక్, ఖో-ఖో, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వారిలో ప్రతిభ చూపిన సుమారు 142 మంది క్రీడాకారులను ఈనెల 23,24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తెలిపారు.

25న అండర్-17 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి21(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా అండర్- 17 బాలుర క్రికెట్ జట్టును ఈనెల 25న నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు తెలంగాణా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ మతిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలు టీ-20 ఫార్మాట్‌లో జరుగుతాయన్నారు.

ఆంగ్లభాషలో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్లభాషలో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం నగరంలోని డీపీఆర్సీ భవన్‌లో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ కార్యక్రమానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హాజరయ్యారు.విద్యార్థులకు ఉపయోగపడేలా సబ్జెక్టు ఫోరాలు నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

బీఆర్ అంబేద్కర్ కాలేజీని తనిఖీ

ఖమ్మంసంక్షేమవిభాగం: ఖమ్మంలోని బీఆర్ అంబేద్కర్ కాలేజీని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి కాలేజీలో సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మాట్లాడారు. శిక్షణా కలెక్టర్ మ్రిణాల్‌శ్రేష్ట పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

ఖమ్మంమార్కెట్,జనవరి21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్‌ను మంగళవారం జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు రైతు సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, తెలంగాణ రైతుసంఘం(సీపీఐ) అధ్యక్షుడు దొండపాటి రమేష్, సహాయ కార్యదర్శి మీరా సాహెబ్ తదితరులు ఉన్నారు.

పంటల కొనుగోళ్లను పరిశీలించిన చైర్మన్

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి ధరలు ఎలా దక్కుతున్నాయో అని ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కోనుగోళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.



షరతులు లేకుండా ఆత్మీయ భరోసా అందించాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోవ్వూరి నాగేశ్వరరావు

ఏన్కూరు, జనవరి21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయభరోసా షరతులు లేకుండా అర్హులైన వారందరికీ అందించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోవ్వూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు మంగళవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలికివెళ్లిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయభరోసా అందిస్తామని ప్రభుత్వం షరతులు అన్యాయమన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో పేదల పక్షాన ఆందోళన చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు మోరెబోయిన కృష్ణ, ఈసం రమేష్, చింతనబోయిన రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

» సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి

సత్తుపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజాసమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చే స్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మంగళవారం స్థానిక వీరవెంకయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 25నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదినేని రమేష్, శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండు రంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకట్రావు, రావుల రాజబాబు, రమేష్, వలి, పాకలపాటి ఝాన్సీ, బాస్కర్ తదితరులున్నారు.

సత్తుపల్లి ఆర్టీసీకి రూ.68.6లక్షల ఆదాయం



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఆర్ఎం జేఎస్.పవిత్ర

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు రూ.68.6లక్షల ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ ఆర్ఎం జేఎస్.పవిత్ర తెలిపారు. మంగళవారం ఆమె సత్తుపల్లి డిపోను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డిపో గేట్ వద్ద ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మొత్తం 179బస్సులను 1,13,132కిలోమీటర్లు తిప్పామన్నారు. ఉద్యోగుల సమిష్టి కృషితో సుమారు 26వేల మందిని గమ్యానికి చేర్చి డిపోకు 94శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించామన్నారు. ఇటీవల ప్రారంభించిన గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి సందర్భంగా సపన్న మస్తును సంస్థ ప్రారంభించిందన్నారు. ఇటీవలే కారుణ్య నియామకాలలో భాగంగా రీజియన్‌లో 50మందిని నియమించగా డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ సంస్థ చేతిలో ఉందన్నారు. కార్యక్రమంలో డీఎం యూ.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీటీఓ కిన్నెర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన దరఖాస్తుల ప్రక్రియ

- » ప్రజాపాలన దరఖాస్తులపై అనుమానాలు
- » అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని ఆరోపణలు



కిష్టారంలో అర్హుల జాబితాలో పేరు లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానికులు

సత్తుపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు పొందేందుకు గతంలో ప్రజాపాలన గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తులు భారీగానే గల్లతైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన గ్రామసభల్లో అనేక మంది దరఖాస్తులుదారులు తమకు అన్ని అర్హతలు ఉన్నా అర్హుల జాబితాలో పేర్లు రాలేదని ఆందోళనకు దిగారు. దాంతో అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరో పక్క అధికారులు ఇటీవల సర్వే చేసి ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా విడుదల చేశారు. కానీ జాబితాలో అనర్హులను ఎంపిక చేశారని పలువురు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో తామంతా దరఖాస్తు చేసుకున్నామని అయినా మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ దరఖాస్తులు...

గతేడాది ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు చేస్తే సరిపోతుందని ప్రకటించింది. ఈ మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు వేల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లలోపు విద్యుత్ రీడింగ్‌కు జీరో బిల్లు తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. కానీ కాలక్రమంలో కొందరికి అర్హత ఉన్నా 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లు, రూ.500లకే గ్యాస్ పథకం వర్తించలేదు. దీనిపై కార్యాలయాల్లో దరఖాస్తుదారులు ఆరా తీస్తే దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదని సమాధానం వచ్చింది. తమ దరఖాస్తు స్వీకరించి రశీదు ఇచ్చారని చూపినా ఫలితం లేకుండా పోయింది. అటువంటి వారందరికీ తాజాగా గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.

గతంలో మీ-సేవా ద్వారా..

గత ప్రభుత్వ హయాంలో మీ-సేవా ద్వారా అప్పట్లో రేషన్ కార్డులు, డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లు గడిచినా మీ-సేవా దరఖాస్తులు ఏమయ్యాయో కనీస సమాచారం లేదు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లపై అసంతృప్తి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే అనంతరం అర్హుల జాబితా అంటూ అధికారులు మంగళవారం గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించారు. జాబితాలను పరిశీలించిన పలువురు తమకు అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇంటి జాబితాలో పేరు లేదని ఆరోపించారు. అనర్హులకు అవకాశం కల్పించారని ఆరోపించారు. తాము గతంలో దరఖాస్తు చేసుకున్నామని, అయినా తమకు రేషన్‌కార్డు మంజూరు కాలేదని తల్లాడ మండలం కొడవటిమెట్టలో పలువురు అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసారు. ఇదే మండలంలో గొల్లగూడెంలో జరిగిన గ్రామ సభలో అధికార పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పలువురు అధికారులను నిలదీశారు. కల్లూరు మండలంలో గ్రామ సభలో గత ప్రభుత్వ హయాంలో తకు అన్యాయం జరిగిందని కొందరు ప్రస్తుత ప్రభుత్వంలో దరఖాస్తు చేసినా న్యాయం జరగడం లేదని మరి కొందరు ఆరోపించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం తుంబూరు, సిద్దారం, కిష్టారం, వేంసూరు మండలం కుంచపర్తి, భీమవరం గ్రామాల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్హత ఉన్నా తమకు మంజూరు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులకు అనారోగ్యం కారణంగానూ, పండగ సందర్భంగా వేరే ఊరు వెళ్లిన సందర్భంగా తాము పనులకు హాజరు కాలేకపోయామని ఈ కారణంతో ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేరు లేకుండా చేశారని పలువురు అధికారుల దృష్టికి తెచ్చారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో ప్రకటించిన జాబితా తుది జాబితా కాదని దరఖాస్తు చేసుకుంటే మరలా విచారణ జరిపి ఎంపిక చేస్తామని శాంతింపజేసారు.

ఇంగ్లీష్‌లో జాబితాలు..

గ్రామ సభల సందర్భంగా అర్హుల జాబితాలను ఇంగ్లీషులో ప్రదర్శించడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అర్హుల జాబితాలు ప్రదర్శించామని, జాబితాలో పేరు లేని వారు మాత్రమే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సభలో ప్రకటించారు. దీంతో జాబితా చూసుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. మాతృభాషలో జాబితా లేకపోవడంతో పలువురు ఇబ్బంది పడ్డారు. అది కూడా అతి చిన్న సైజు అక్షరాలతో జాబితాను ప్రదర్శించడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం మొక్కుబడిగా అధికారులు జాబితాలు ప్రదర్శించారని పలువురు ఆరోపించారు.

ఉద్యోగులకు పరీక్షలు

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మైన్స్‌లో బ్లాస్టింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ఉద్యోగులు, కార్మికులకు మంగళవారం జేవీఆర్, కిష్టారం ఓసీలలో పరీక్షలు నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా రక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఓవర్‌మెన్, బీఎండీ ట్రక్ డ్రైవర్లు, వ్యాన్ డ్రైవర్లు, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్స్ పరీక్షలతో పాటు ప్రావీణ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ మేనేజర్ గోవింద్, సేఫ్టీ ఆఫీసర్ రమాకాంత్, డీవైఎస్ఈ సూర్యప్రకాష్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి 7వ లైన్‌లో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.58,116 విరాళాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా దాతలు వెనిగళ్ల దుర్గారావు, విజయలక్ష్మి, మహేష్, శశికళ, దాయక దుర్గారావు, ఉమలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామ సభలు



ముదిగొండలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ముదిగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. మంగళవారం ముదిగొండ మండలం మేడేపల్లిలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పమ్మి గ్రామంలో గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో కొద్దిసేపు గ్రామసభ రసాభసాగా మారింది.

కొణిజర్ల, జనవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో పథకాలపై నిర్వహించారు. చిన్నమునగాలలలో దరఖాస్తుదారుల పేర్లు చదువుతుండగా ఇంటిపేరులేకుండ ఎలా దరఖాస్తు తీసుకున్నారని స్థానికులు అభ్యంతరాలు పెట్టారు. అర్హుల విషయంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగవద్దని, స్థానికంగా లేనివారి పేర్లను తొలగించాలని తీగలబంజర గ్రామసభలో స్థానికులు పలువురు ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేశారు.

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టారం, తుంబూరు, సిద్దారం గ్రామాలలో ప్రజలు గ్రామసభలను అడ్డుకున్నారు.

కల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరు గ్రామ పంచాయతీ సభలో ఏకంగా ఓ ముస్లిం మహిళ మైకు పట్టుకొని తమకు గత పాలనలో కూడా డబుల్ గృహాలు అందలేదని ఈ సారైన ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఉండగా చివరకు నిరాశే ఎదురైందని ముస్లిం మహిళలు ఎస్‌కె జమీల, పరహాన నిరసన వ్యక్తం చేశారు. ఫిర్యాదులు అందితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చంద్రశేఖర్ చెప్పారు.

చింతకాని, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో రసాభసా నెలకొంది. నాగులవంచ గ్రామంలో జరుగుతున్న గ్రామసభను సీపీ సునీల్‌దత్ పరిశీలించారు.

వైరా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం, మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో మంగళవారం జరిగిన గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలకు ఎంపిక కాని పలువురు అర్హులు అధికారులను నిలదీశారు. సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

వేంసూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పథకాలు నిరంతర ప్రక్రియ అని ఎంపీడీవో రంజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కుంచపర్తి, మర్లపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

బోనకల్, 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లపాడు, జానకీపురం, బ్రాహ్మణపల్లి గ్రామసభలల్లో డీపీవో ఆశాలత పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం గ్రామసభల్లో పథకాల ఎంపికలకు అర్హులైనా తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని ప్రశ్నించారు.

మధిర రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో 14గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఇల్లూరు గ్రామసభలో పలువురు లబ్ధిదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే మధిర పట్టణంలో పలు వార్డుల్లో గ్రామసభలు నిర్వహించారు. కొత్తగా 423దరఖాస్తులు వచ్చాయి. మునిసిపల్ చైర్మన్ లత, కమిషనర్ సంపత్‌కుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, జనవరి21(ఆంధ్రజ్యోతి): జమలాపురం గ్రామంలో అమెరికాలో నివాసం ఉంటున్న వ్యక్తులకు రేషన్‌కార్డులు మంజూరుచేశారని, గ్రామంలో అర్హులైన నివాసం ఉంటున్న వారికి రేషన్‌కార్డులు రాలేదని ఓ వ్యక్తి ఆగ్రహించడంతో తహసీల్దార్ ఉషాశారద జోక్యంతో గొడవ సర్దుమణిగింది.



కృష్ణాపురం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

పెనుబల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 625, రేషన్‌కార్డుల కోసం 1008, రైతుభరోసా కోసం 69, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 1,156దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయని ఎంపీడీవో అన్నపూర్ణ తెలిపారు.

తల్లాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొడవటిమెట్ట, గొల్లగూడెం, అన్నారుగూడెం గ్రామసభల్లో అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



వైరాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్మన్ జైపాల్, కమిషనర్ వేణు



కల్లూరులో కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగిన మాజీ వార్డు సభ్యుడు



తల్లాడలో అధికారులకు దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు



తీగలబంజర గ్రామసభలో ప్రశ్నిస్తున్న లబ్ధిదారులు

ఆటో ఫల్టీ

» ఎనిమిదిమందికి గాయాలు

ముదిగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ ఆటో పల్టీకొట్టిన సంఘటనలో ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలోని వల్లభి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. నేలకొండపల్లి మండలం చెరువుమాదారానికి చెందిన 8మంది కూలీలు ఆటోలో ఏపీలోని గండ్రాయిలో వరినాట్లు వేసేందుకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో చెరువుమాదారానికి చెందిన అమరగాని రాంబాయి, పగిడిపర్తి లక్ష్మి, బొల్లికొండ విజయ, ఆళ్లకుర్తి వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ, రాణి, వరలక్ష్మి, ఉమలకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేశారు.

కల్లంలో మిర్చి చోరీ

తల్లాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కల్లంలోని మిర్చిని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం రాత్రి తల్లాడలో చోటుచేసుకుంది. తల్లాడకు చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగుచేశాడు. ఆదివారం కూలీలతో మిర్చిని కోయించి పక్కన కల్లంలో ఆరబోశాడు. సోమవారం రాత్రి ఐదు బస్తాల మిర్చిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై రైతు శ్రీనివాసరెడ్డి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

బోనకల్, 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా చేపడుతున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నమునా నిర్మాణ పనులను మంగళవారం హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఇంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని ప్రజలంతా ఇంటి నమూనాను చూసేందుకు రానున్నందున పనులను పకడ్బందీగా జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నిబంధనలు పాటించాలి

» సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నిబంధనలు పాటించడం అందరి బాధ్యత అని సత్తుపల్లి ఎంవీఐ జేఎస్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవా రం రోడ్డు భద్రత మాసోత్సవాల సం దర్భంగా మండలంలోని కిష్టారం వై జంక్షన్ వద్ద లారీ యూనియన్ కార్యాలయం వద్ద డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మితిమీరిన వేగం, అవగాహన రాహిత్యంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రహదారి నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంవీఐ దినేష్, లారీ యూనియన్ బాధ్యులు కొండపల్లి రమేష్‌రెడ్డి, మౌలాలీ, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసరావు

27న బహిరంగ వేలం పాట

ఏన్కూరు, జనవరి21(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీలక్ష్మి నర్సింహస్వామి దేవాలయ ప్రాంగణం నందు లడ్డూ ప్రసాదం, పులిహోర విక్రయించేందుకు ఈనెల 27న సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10గంటలకుదేవాదాయ కమిషనర ఖమ్మం కార్యాలయం నందు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మామిడి, మల్బరీ పంటల సాగుపై రైతు సదస్సు



మామిడిపై రైతులకు అవగహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి నగేష్

కల్లూరు, జనవరి 21 (ఆం ధ్రజ్యోతి): కల్లూరులో మంగళవారం మామిడి, మల్బరీ పంటల సాగుపై రైతు సద స్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా పట్టు పరిశ్రమశాఖ ఉప సంచాలకులు ముత్యా లు, ఉద్యాన శాఖ అధికారి జి. నగేష్‌లు మాట్లాడుతూ మామిడి, మల్బరీ పంటల సాగులో రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై సమగ్రంగా అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మామిడి, మల్బరీ పంటల సాగు ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. రవికుమార్, కేవీకే శాస్త్రవేత వి. చైతన్య, రైతులు కాటంనేని రమణయ్య, కాటంనేని రామారావు, వల్లపునేని శ్రీను, రవి, అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అందరికీ పథకాలు వర్తింపజేయాలి

చింతకాని, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. సీపీఎం మండల కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జాబితాలో అనర్హుల జాబితా ఎక్కువగా ఉందన్నారు. ప్రజల నిరసనలతో సర్కారు తీరు అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, నన్నక కృష్ణమూర్తి, గడ్డం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కర్రల లోడ్ మీదపడి కార్మికుడికి గాయాలు

సత్తుపల్లిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ జామాయిల్ లోడ్ మీదపడి ట్రాక్టర్ నడుపుతున్న ఒరిస్సా కూలీకి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం సత్తుపల్లి మండలం జగన్నాథపురంలో చోటుచేసుకుంది. ఒరిస్సాకు చెందిన జానివస్తు రాజు జామాయిల్ కర్రల లోడింగ్ పనికి వచ్చాడు. జామాయిల్ కర్రల లోడ్‌తో ట్రాక్టర్ నడుపుతుండగా పొలంగట్టు దాటే క్రమంలో ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కర్రలు అతనిపై పడ్డాయి. గమనించిన తోటికూలీలు బయటకు తీసి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెట్రోల్ బంకులు, సినిమా హోళ్లకు రైతుబంధు

» వైరా వ్యవసాయ డివిజన్‌లో సాగుకు యోగ్యం కాని భూములు 442.25ఎకరాలు

వైరా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైరా వ్యవసాయ డివిజన్‌లోని కొన్ని మండలాల్లో పెంట్రోల్ బంకులు, సినిమా హాళ్లకు సైతం రైతుబంధు పథకాన్ని అమలుచేశారు. ఒక్క వైరా మండలంలోనే నాలుగు పెట్రోల్‌బంకులు, ఒక సినిమా హాల్, రైస్‌మిల్లు, రెస్టారెంట్‌లు అలాగే ఇటుక బట్టీలు, వెంచర్లు, ఖాళీ ఇండ్లస్థలాలకు సైతం రైతుబంధు కింద డబ్బులు చెల్లించారు. మిగిలిన మూడు మండలాల్లో కూడా ఇదే పరిస్థితి దాపురించింది. వ్యవసాయ యోగ్యం కాని భూములుగా 442.25ఎకరాలు గుర్తించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఆరు రోజుల నుంచి రెవెన్యూ గ్రామాల వారీగా సాగుకు యోగ్యం కాని భూములను సర్వే చేసి వాటిని గుర్తించారు. ఇప్పటివరకు వైరా వ్యవసాయ డివిజన్‌లో 1,15,105ఎకరాలకు రైతుబంధు డబ్బులు చెల్లిస్తున్నారు. ఇప్పుడు 442.25ఎకరాలు వ్యవసాయ యోగ్యంగా లేకపోవడంతో ఇకమీదట 1,14,666.34ఎకరాల వ్యవసాయ భూములకు మాత్రమే ఈనెల 26వతేదీ నుంచి రైతుభరోసా అందించనున్నారు. మండలాలవారీగా వ్యవసాయానికి పనికొచ్చే భూముల వివరాలిలా ఉన్నాయి.



వైరాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూములను పరిశీలిస్తున్న ఏడీఏ కరుణశ్రీ, సర్వే బృందం(ఫైల్)

మండలం	మొత్తం భూమి	వ్యవసాయానికి పనికొచ్చే భూమి	వ్యవసాయానికి యోగ్యం కాని భూములు
వైరా	26,689	26,629	61.19
కొణిజర్ల	37,232	37,096	136
ఏన్కూరు	28,971	28,813.28	158.32
సింగరేణి	22,213	22,128.06	86.14
మొత్తం	1,15,105	1,14,666,34	442.25

రైస్ మిల్లును మార్చాలని ఆందోళన

కొణిజర్ల, జనవరి21(ఆంధ్రజ్యోతి): కాలనీలోని ఇళ్ల మధ్య రైస్‌మిల్లు ఉండటం వలన దానిని నిరంతరంగా ఆడించటంతో మిల్లునుంచి వచ్చే దుమారంతో(డస్ట్) ఎలర్జీ వస్తుందని, ఇండ్లలో ఉండలేకపోతున్నామని, మిల్లును మార్చాలని కోరుతూ మండల కేంద్రం కొణిజర్ల ఎస్సీ కాలనీలో గల రైస్‌మిల్లు వద్ద కాలనీకి చెందిన పలువురు కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేశారు. ఇళ్ల మధ్య మిల్లు ఉండటం వలన మిల్లు ఆడినప్పుడు దుమ్ము బాగా వస్తుందని, ఇంట్లో విపరీతమైన దుమ్మురావడం చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు అర్థం చేసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఎస్ఐ సూరజ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమస్యను సివిల్‌సప్లయ్ అధికారులకు, పొల్యూషన్ అధికారులు తెలిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆందోళన విరమించాలని సూచించారు. దాంతో ఆందోళనకారులు తమకు న్యాయం జరగాలని కోరుతూ ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ సూరజ్